క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించం

జూపాడుబంగ్లా: ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని ఉపాధిహామీ పథకం జిల్లా మానిటరింగ్ మరియు ఎవాల్యేషన్ అధికారి భాస్కర్‌నాయుడు హెచ్చరించారు. గురువారం ఉపాధిహామీ పథకం కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తాటిపాడులో వెంటనే ఉపాధి పనులు ప్రారంభించేలా చేయాలని ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషాలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యంలో శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్ హాల్‌లో ముంతాజ్‌హోటల్ యజమాని మక్బూల్ సోదరుని కుమార్తె వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సాగునీటి ప్రాజెక్టుల సందర్శన

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని మల్యాల గ్రామం వద్దనున్న హంద్రీనీవా ఎత్తిపోతల పథకాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి గురువారం సందర్శించారు. అనంతరం ఆయన పట్టణంలోని అల్వాల కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను రాజకీయ నాయకులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల వేల కోట్లు రూపాయలు నష్ట పోవాల్సి వస్తోందన్నారు.

మత్స్యకారుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మత్స్యకారులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక మత్స్యకారులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారంలో దూసుకుపోతున్నారు. గురువారం లింగాలగట్టులోని వైజాగ్ క్యాంప్‌లో కృష్ణవేణి మత్స్యకార సహకార సంఘం నాయకులు కొండబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించే పథకాలను వివరించారు. సున్నిపెంటలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. వంగా తిలోత్తమ, పార్టీ నాయకులు వట్టి వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శోభన్‌బాబు, దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన ఉద్యోగికి నోటీసు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ స్థాయి అధికారి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుతో కలిసి ఫోటో దిగడం, ఆ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడం, ఈఓకు ఫిర్యాదులు వెల్లడంతో సదరు ఉద్యోగిని ఈఓ సంజాయిషీ కోరారు. గురువారం సదరు ఉద్యోగికి వారం రోజుల లోపు సంజాయిషీ ఇవ్వాలని నోటీసు ఇచ్చారు.

జగనన్నతోనే ప్రజాసంక్షేమం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: అవినీతి, అక్రమాలకు తావులేని ప్రజా సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎంపీటీసీ పద్మావతి, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, దొడ్డాసుధాకర్ తెలిపారు. గురువారం తూడిచెర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్‌లను గెలిపించాలని కోరారు. దొంతుల నరసింహుడుయాదవ్, నల్లబోతుల వెంకటనాయుడు, పెరుగు సోమశేఖర్, కుమ్మరి వెంకటేశ్వర్లు, దొంతుల నడిపెన్న, చిమ్మెసురేష్ పాల్గొన్నారు.

పొలాల్లో మంటలు

మహానంది: అబ్బీపురం గ్రామ శివారులోని పొలాల్లో గురువారం మంటలు చెలరేగాయి. మంటలు ఊర్లోకి వ్యాపించే ప్రమాదం ఉండటంతో గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. వారు గ్రామానికి రుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఎంతపని చేశావయ్యా.. చంద్రబాబు!

- పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగుల పాట్లు.
- మండుటెండలో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు.
- చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్న లబ్ధిదారులు



లబ్ధిదారులతో కిటకిటలాడుతున్న పగిద్యాల కెనరా బ్యాంకు

ఆత్మకూరు/నందికొట్కూరు: ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారకముందే గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల తలుపులు తట్టి పింఛన్లు అందిచేవారు. దీంతో అవ్వాతాతల మోములో ఆనందం కనిపించేంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే అందిస్తున్న సేవలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. గత నెలలో నానా అవస్థలు పడి సచివాలయాలకు వెళ్లి పింఛన్ తెచ్చుకుంటే.. ఈ నెల ఎక్కడో ఉన్న బ్యాంకులకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి. మండుటెండలో మండల కేంద్రాల్లో సుదూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికైతే బ్యాంకులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. దీంతో ఎంతపని చేశావయ్యా చంద్రబాబు అంటూ లబ్ధిదారులు శాపనార్థాలు పెడుతున్నారు.

బ్యాంకులు, సర్వీసు కేంద్రాల వద్ద పడిగాపులు

ఆత్మకూరు పట్టణంలోని ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ కేంద్రాల వద్ద వృద్ధులు తమ ఆధార్‌కార్డులను చూపుతూ పింఛన్ పడిందా లేదా అంటూ తనిఖీలు చేసుకుంటున్నారు. చాలా మంది బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింక్ లేకపోవడంతో పింఛన్ పడిందో లేదో తెలియడం లేదు. దీంతో బ్యాంకులోకి వెళ్లి ఆధార్ లింక్ చేసుకోవాలని కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకులు సూచిస్తున్నారు. కొందరికి పింఛన్లు పడలేదని చెప్పడంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆత్మకూరు పట్టణంతో పాటు మండల కేంద్రాలకు వచ్చేందుకు వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు.

బ్యాంక్‌ల వద్ద వృద్ధుల అగచాట్లు

పగిద్యాల: పింఛన్ సొమ్మును డ్రా చేసుకోవడానికి వెళ్లిన వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, డప్పు కళాకారులు, కల్లుగీత కార్మికులు, డయాలసిస్ రోగుల బాధలు వర్ణాతీతం. గురువారం స్థానిక కెనరా బ్యాంక్ వద్ద ఉదయం 9 గంటల నుంచి బ్యాంక్ సిబ్బంది రాక కోసం పడిగాపులు కాశారు. బ్యాంక్ ఆవరణ పింఛన్‌దారులతో కిక్కిరిసింది. సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో వృద్ధులు ఎండ తీవ్రతతో ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. వృద్ధులపైనా.. రాజకీయం చేసేదని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు లబ్ధిదారులు శాపనార్థాలు పెట్టారు.

ఆధార్‌కు లింకు లేదని వెనక్కి పంపారు



పింఛన్ కోసం రెండు రోజులుగా ఎస్‌బీఐ కేంద్రానికి తిరిగుతున్నారు. బ్యాంకులో ఆధార్ లింకు కాలేదని నన్ను వెనక్కి పంపారు. దీంతో నాకు ఏమీ పాలుపోవడం లేదు. గతంలో నా పింఛన్ కార్డు చూపిస్తే వెంటనే పింఛన్‌ను ఇంటి వద్దకు వచ్చి వలంటీర్లు ఇచ్చేవారు. ప్రస్తుతం బ్యాంకులో అకౌంట్ ఉన్నా మాకు డబ్బులు జమ కావడం లేదు. టీడీపీ నాయకుడు చంద్రబాబునాయుడు చేసిన పని వల్లే తాము ఇలాంటి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సరోజమ్మ, ఎస్‌పీజీ పాలెం, ఆత్మకూరు

చార్జీలు పెట్టుకుని బ్యాంకుల వద్దకు



ఆత్మకూరుకు శ్రీపతిరావుపేట నుంచి ఆటోకు రూ.100 చెల్లించి వస్తున్నాం. పింఛన్ డ్రా చేసుకునేందుకు కస్టమర్ కేర్ సెంటర్ వద్దకు వస్తే మీ ఖాతా వివరాలు రావడం లేదని చెబుతున్నారు. బ్యాంకు వద్దకు వెళ్తే ఆధార్ లింక్ కాలేదని చెబుతున్నారు. అసలు చంద్రబాబాబు చేసిన పని వల్లే ఇలా తయారయ్యింది. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది.

– బజారయ్య, శ్రీపతిరావుపేట

జగనన్న వచ్చే వరకు కష్టాలు తప్పవు



నేను ఒకరి సహాయం లేనిదే ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. అలాంటిది బ్యాంక్‌కు వెళ్లి పింఛన్ పైసలు తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. ఇది చూస్తే గతంలో చంద్రబాబు పాలన గుర్తొస్తోంది. గతంలో జైకిసాన్ పార్కులో కింద కూర్చొన్ని రోజులు తరబడి ఉంటేనే పింఛన్ డబ్బులు అందేవి కావు. మళ్లీ జగనన్న పాలన వచ్చే వరకు బాధలు తప్పవు. – మాబాషా, దివ్యాంగుడు బీఎస్ఎస్ఆర్ నగర్

10 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చా



మండుటెండలో జూపాడుబంగ్లా మండలం తంగడంచ గ్రామం నుంచి బుధవారం పింఛన్ కోసం పట్టణంలోని బ్యాంక్ వద్దకు వచ్చా. తీరా అక్కడికి వెళ్లాక బ్యాంక్‌కు సెలవు అని చెప్పారు. బస్సు చార్జీ పోనూ రూ. 40 ఖర్చు వచ్చింది. కూలి పనులు వదిలేసి మళ్లీ ఈ రోజు రావాల్సిన పరిస్థితి దాపురించింది. మళ్లీ పాతరోజులు గుర్తుకు తెస్తున్నారు. అసలే ఎండలు మండుతున్నాయి. ఎన్ని రోజులు బ్యాంక్ చుట్టూ తిరగాల్సి వస్తుందో.

– గొల్ల లక్ష్మిదేవి, తంగడంచ గ్రామం

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగన్‌ను ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి

మిడుతూరు: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి కోరారు. మండలంలోని కడుమూరు గ్రామంలో గురువారం స్థానిక నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. మళ్లీ అయన సీఎం అయితేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆదిరెడ్డి జగదీశ్వర రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తగ్గిన తర్తూరు రంగనాథుని హుండీ ఆదాయం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని జాతర ముగియడంతో గురువారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ ఏడీ వెంకటరమణ అధ్వర్యంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. స్వామివారి సన్నిధిలోని రెండు శాశ్వత హుండీలు, అమ్మవారి సన్నిధిలోని ఓ హుండీ లోని కానుకలను భక్తులు లెక్కించగా రూ.7,22,308ల నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బుధవారం లెక్కించిన మూడు తాత్కాలిక హుండీల్లో రూ.4,42,901ల నగదు కలిపి మొత్తంగా 11,65,209 నగదు సమకూరినట్లు వెల్లడిచారు. ఎండల తీవ్రత వల్ల భక్తుల రాక తగ్గటంతో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,09,369 ఆదాయం తగ్గినట్లు ఈఓ తెలిపారు.

అనుమతుల లేకుండా కలప నిల్వ ఉంచరాదు

మహానంది: ఎలాంటి అనుమతులు లేకుండా కలపను రవాణా చేయడం, నిల్వ ఉంచడం చేస్తే కఠిన చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా తెలిపారు. బండిఆత్మకూరు మండల పెద్ద దేవళాపురంలో కార్పెంటర్లు, టింబర్ వర్కర్ల సంస్థలపై గురువారం దాడులు నిర్వహించారు. రశీదులు, పర్మిట్‌లు లేకుండా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకుని గాజులపల్లె టింబర్ డిపోకు తరలించారు. మొబైల్‌పార్టీ డీఆర్‌ఓ నాగేంద్రనాయక్, పీవీ సుబ్బయ్య, రవీంద్రనాయక్, బీవీ రమణ పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజా ద్రవ్యాల సమర్పణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం స్థాపించి 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఆర్యవైశ్య మహిళలు మెయిన్ బజార్‌నుండి వాసవీ మాత ఆలయం వరకు ఊరేగింపుగా పూజాద్రవ్యాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కొత్త.వెంకటేశ్వరరావు, చల్లా కిషోర్, కొత్త ఆదిలక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మహానంది: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి కోరారు. వేసవి ఎండలు మండుతుండటంతో ఉపాధి కూలీలకు గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులకు వెళ్లేవారు తరచూ మంచినీరు తీసుకోవాలన్నారు. ఎక్కువ సేపు ఎండలో పనులు చేయాల్సి వచ్చిన సందర్భంలో తలకు రుమాల లేదా టోపీలు ధరించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



కొక్కెరంచలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

- కూటమి అభ్యర్థులకు ఓటేస్తే రాష్ట్రాన్ని పంచుకొని దోచుకుంటారు
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. 2024లో జగనన్న సీఎం కాకపోతే దొంగల చేతితోకి రాష్ట్రం వెళ్తుందని, వారు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటారన్నారు. గురువారం మండలంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు చంద్రమౌళిల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా నాగంపల్లి, కొక్కెరంచ, జడ్డువారిపల్లె, ఎదురుపాడు, గోకవరం, కొత్తపల్లి, వీరాపురం, గువ్వలకుంట్ల, బావాపురం, నందికుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగింది. వారు మాట్లాడుతూ 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకపోతే టీడీపీ, జనసేన, బీజేపీ దొంగల పార్టీల చేతిలోకి రాష్ట్రం వెళ్తుందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి చంద్రబాబు నాయుడు రాష్ట్రం ముక్కలు అవ్వడానికి ప్రధాన కారకుడన్నారు. కూటమి అభ్యర్థులకు ఓటువేస్తే రాష్ట్రాన్ని పంచుకొని దోచుకుతింటారన్నారు.

ప్రత్యేక పంచాయతీగా నాగంపల్లి

ఎన్నికల ప్రచారం లో భాగంగా నాగంపల్లి గ్రామస్తులు వారి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. తప్పకుండా ప్రభుత్వం ఏర్పాడిన వెంటనే జగనన్నకు తెలియజేసి ప్రత్యేక పంచాయతీగా గుర్తించేందుకు కృషి చేస్తామని సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా లింగాల ఎత్తిపోతల పథకానికి మరమ్మత్తులు చేయించి కొక్కెరంచ, ఎదురుపాడు, నాగంపల్లి గ్రామాల సాగుభూమికి నీరు అందించే రైతులకు న్యాయం చేస్తామన్నారు. మండలంలో సంగమేశ్వరం సమీపంలో మరో ఎత్తిపోతల పథాకాన్ని నిర్మించే విధంగా చర్యలు తీసుకొని మండాలన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. గురువారం మండల కేంద్రంలో జగనన్న ఇళ్ల పట్టాల మండల కో-ఆర్డీనేటర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గనమల పరశురాముడు అన్న లింగస్వామి భార్య గనమల మీన అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీపీ కుసుమలత, వైస్ఎంపీపీ సింగారం వెంకటరమణ (రంగ), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, సచివాలయాల మండల కన్వీనర్ పి.నాగలక్ష్మి రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మండల కేంద్రంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్ధన్‌రెడ్డి, సర్పంచు బాల ఎల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున రెడ్డి, సుబ్బరాయుడు, భరత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామానికి చెందిన శివకుమార్, దాసు, నరసింహ, పరశురాముడు, మద్దిలేటి, రామకృష్ణ,తోపాటు 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరికి శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- కూటమి అభ్యర్థులను ఓడించాలి
- బాబు జైలుకు పోకుండా ఉండేందుకే బీజేపీతో పొత్తు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డి



ఏ.కోడూరులో అశేషజనం మధ్య ప్రచారం నిర్వహిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: పేదలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మండలం అయ్యవారికోడూరు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డిలకు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఏ.కోడూరు నుంచి పార్నపల్లె, కాకనూరు గ్రామాల్లో రాత్రి వరకు ప్రచారం కొనసాగించారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలతో వస్తున్న కూటమి అభ్యర్థులను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రెండు బటన్లు నొక్కి ఫ్యాన్ గాలి స్పీడ్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబునాయుడు జైలుకు పోకుండా ఉండేందుకే బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని, విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు.

ఏ.కోడూరులో రూ. 2.63కోట్లతో అభివృద్ధి

ఏ.కోడూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 2.63కోట్లతో రహదారులు, అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గ్రామానికి రూ. 40లక్షలు వచ్చినట్లు చెప్పారు. పొలాలకు రైతులు ఆయుకట్టు రోడ్లను అడిగారని, దీంతో పాటు శ్మశానానికి ప్రహరిగోడ నిర్మాణం, 75 ఎకరాల పొలాలకు శాశ్వతపట్టాలు కావాలని ప్రజలు అడిగిన విషయాలు గుర్తున్నాయని, మన ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టగానే తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు. పార్నపల్లె గ్రామంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ హుసేన్‌వలి, గౌస్ లాజామ్, షేక్ మహబూబ్‌బాషా, మునాఫ్, మాలిక్, సనావుల్లాలతో పాటు మరికొందరు నాయకులు ఎమ్మెల్యే శిల్పా, బుడ్డా శేషారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లాలిస్వామి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి, ఏ.కోడూరు సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, మన్నె కుమార్, శ్రీరామ్‌రెడ్డి, మగ్బుల్‌బాషా, సర్పంచ్‌లు షేక్ షబ్బీర్ అహమ్మద్, నర్ల సులోచనమ్మ, రామలింగేశ్వరరెడ్డి, కడిపిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి, దేరెడ్డి పరమేశ్వరరెడ్డి, నర్ల మహేశ్వరరెడ్డి, నర్ల సుబ్బారెడ్డి, జక్కం శివారెడ్డి, కాకనూరు సుబ్బయ్యయాదవ్, దేరెడ్డి పుల్లారెడ్డి, ఎస్.ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన జగనన్నకే సాధ్యం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి

పగిద్యాల: అన్ని వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తూ సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నెహ్రూనగర్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. గత ఐదేళ్లలో జగనన్న పేదలకు చేసిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. డాక్టర్ దారా సుధీర్‌ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు, నాగశేనారెడ్డి, పాలూరు వెంకటేశ్వర్లు, బండారు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లాలి



శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, బుడ్డా శేషారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల జరిగిన మేలును ప్రజలకు వివరించి ఆశీస్సులు కోరేందుకు బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి.. ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. నాయకత్వం వహించే సామర్థ్యం ఉన్న కార్యకర్తలను బూత్ కమిటీ కన్వీనర్లుగా, సభ్యులుగా నియమించారని చెప్పారు. మీరంతా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ గుండ్రెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ జయపాల్, మండల కార్యదర్శి కే. రామ్మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, వంగాల నాగేశ్వరరెడ్డి, జబివుల్లా, షాషాఖాద్రీ, ఎంపీటీసీలు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం అర్బన్‌కాలనీ, వెంగళ్‌రెడ్డి కాలనీకి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అర్బన్ కాలనీకి చెందిన బాలీశ్వర్‌రెడ్డి, రాఘవ, క్రిష్ణ, శివ, ముర్తుజా, ఉసేన్, నాయక్‌తో పాటు 100 కుటుంబాలకు చెందిన సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్.శ్రీనివాసరెడ్డి, జయకృష్ణ, రమణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి భువనేశ్వర్‌రెడ్డి, బుడ్డా శేషారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, పట్టణాధ్యక్షులు సయ్యద్ మీర్, పట్టణ ఉపాధ్యక్షులు నాగరాజు, విజయ్‌చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేరాలని ప్రచారం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా (జూనియర్ కళాశాల) ప్రభుత్వం మార్పు చేయడంతో హెచ్ఎం పి.వెంకటసుబ్బారెడ్డి గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉంటాయన్నారు. ఇందులో ఇప్పటికే బైపీసీలో 10 మంది, ఎంపీసీలో 8 మందికి అడ్మిషన్లు ఇచ్చామని చెప్పారు.


ముమ్మరంగా ఓటరు స్లిప్పుల పంపిణీ



తాటిపాడులో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్ఓ అల్లావుద్దీన్

జూపాడుబంగ్లా: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని నియోజకవర్గం వ్యాప్తంగా ఓటర్లకు బూత్‌లెవెల్ ఆఫీసర్లు ఓటరు స్లిప్పులను ముమ్మరంగా పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 251 పోలింగ్ బూత్ ఉండగా 2,16,560 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,06,125 మంది పురుషులు, 1,10,418 మంది స్త్రీలు, ఇతరులు 17మంది ఉన్నారు. జూపాడుబంగ్లా మండల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలుండగా 14,472 మంది పురుషులు, 15,164 మంది స్త్రీలు, ఇతరులు 1 ఉన్నారు. వీరందరికీ మంజూరైన ఓటరు స్లిప్పులను ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నారు. ఓటు వేయటానికి బీఎల్‌ఓలు ఇచ్చిన ఓటరు స్లిప్పును తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాని సూచించారు.

ఎస్సీలను విభజించడమే టీడీపీ లక్ష్యం



దళిత పంచాయతీల గురించి వివరిస్తున్న శోభన్‌బాబు

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాలను విభజించి పాలించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, ఎస్సీలు ఐక్యంగా ఉండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ గంగుమాల శోభన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం సున్నిపెంటలోని క్రిష్టియన్ మీటింగ్ రూం సమీపంలో ప్రచారాన్ని నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని, దీంతో దళితులకు సర్పంచ్, వార్డుమెంబర్లు అయ్యే అవకాశం ఉందన్నారు.

ప్రతి ఇంట్లో సంక్షేమం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శిల్పా భాగ్యలక్ష్మి



మోతుకూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: ఏ ఇంటికి వెళ్లినా సీఎం వైఎస్ జగన్ మార్కు పాలన కనిపిస్తోందని, ప్రతి ఇంటా సంక్షేమ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని సీపీ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా బావమరిది గుండ్రెడ్డి రాఘవరెడ్డి మోతుకూరు గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలను ఆశీర్వదించి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కే. రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ జయపాల్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, నాగేశ్వరరెడ్డి, బోగోలు సుదర్శనం, షంషీర్ అలీ, గోవిందు, వెంకటేశ్వర్లు, ఖాదర్‌వలి, మహ్మద్‌ఖాన్, నారాయణ పాల్గొన్నారు.